## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ రాహుల్‌రాజ్


పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

**పాపన్నపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్‌జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన పాపన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, వార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు పనిచేయాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులతో మర్యాదగా మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించా లన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా. జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.





మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఎసిబికి చిక్కిన ఉత్తమ ఉపాధి హామీ ఈసి

**చేర్యాల (మద్దూరు),ఆగస్టు 26,ప్రభాతవార్త :**
ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధి హామీ ఈసిని లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పట్టుకున్నారు.ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా బండకింది పరుశరాములు విధులు నిర్వర్తిస్తున్నాడు.ఉపాధి హామీ బిల్లులు ఆమోదం,ఫైళ్ళ,చెక్ కొలతల కోసం ఉన్నత అధికారులకు పంపడానికి ఫిర్యాధుదారుని నుండి రూ.11,500 లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించాడు.దీంతో మంగళవారం పథకం ప్రకారం పరుశురాములుకు డబ్బులు ఇవ్వడంతో ఏసిబి డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసిబి అధికారులు ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి,కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.అంతే కాకుండా ఈ నెల పంద్రాగస్టు నాడు మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ఉత్తమ అవార్డును అందుకున్నాడు.


చౌటకూరులో జిల్లా వ్యవసాయ అధికారిని నిలదీస్తున్న రైతులు

### యూరియా అందుబాటులో ఉంచకుండా డ్రోన్ల సహాయంతో
## పిచికారిపై అవగాహన సదస్సు ఎలా నిర్వహిస్తారు?
**-జిల్లా వ్యవసాయాధికారిని నిలదీసిన రైతులు**

**చౌటకూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం ఇఫ్కో ఆధ్వర్యంలో డ్రోన్ల సహాయంతో యూరియా పిచికారి కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌ను రైతులు నిలదీశారు. యూరియా, డిఏపిని చౌటకూరులో అందుబాటులో ఉంచకుండా డ్రోన్ల సహాయంతో యూరియాను పిచికారి చేసే పద్దతిపై అవగాహన సదస్సును ఎలా నిర్వహిస్తారని రైతులు ప్రశ్నించారు. యూరియాను పిచికారి చేసేందుకు రైతులకు సబ్సిడీపై డ్రోన్లలను అందించాలని డిమాండ్ చేశారు. రైతులు మాటలకు స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతు బంధు డబ్బులతో డ్రోన్‌లను కొనుగోలు చేయాలంటూ ఉచిత సలహా ఇవ్వడంతో రైతులకు పెండు మీద కారం చల్లినట్లవడంతో అధికారి మాటలపై మండిపడుతూ వాగ్వాదానికి దిగారు. సబ్సిడీపై డ్రోన్‌లను అందచేయాలంటే సరైన సమాధానం ఇవ్వకుండా రైతుబందుతో కొనుగోలు చేయమంటావా, అది మాకు తెలియదా, రైతుబందు పంటల సాగుకా యంత్రాల కొనుగోలు అందచేస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ప్రయోజనం అయ్యేలా చూడకుండా ఉచిత సలహాలు ఇస్తే ప్రయోజనం ఏమిటని అధికారిని ప్రశ్నించారు.

**మధ్యలోనే వెళ్లిపోయిన అధికారి...**
చౌటకూరులో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ను రైతులు నిలదీయడంతో చేసేది లేక అధికారి సభ మధ్యలో నుంచి వెళ్లిపోయారు.

## మట్టి గణపతే..మహా గణపతి : సబ్ కలెక్టర్


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త :** మట్టి గణపతే మహా గణపతి అని సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. నారాయణఖేడ్ పరిధిలోని 14 గురుకులాలు, 34 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకుల తయారీపై పోటీలు నిర్వహించారు. అందులో ఆకర్షనీయమైన, జీవకళ ఉట్టిపడే విధంగా తయారుచేసిన మట్టి గణపతుల ప్రతిమలకు ప్రశంసాపత్రాలు, స్టీల్ నీళ్లబాటిల్, టిఫిన్‌బాక్స్, జూట్ బ్యాగులను విద్యార్థులకు ఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతి మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అందజేశారు.

## ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు
**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :**
ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మంగళవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబ సమేతంగా భక్తిశ్రద్దలతో జరుపుకోవాలన్నారు. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది.. పూజించేది విగ్నేశవరున్నే అని తెలిపారు. విగ్నేశ్వరుని అనుగ్ర హంతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలని అకాంక్షించారు. మట్టి గణపతి పూజించడం ఎంతో శ్రేష్ట మని.. మట్టి గణపతే మహా గణపతి అన్నారు.పర్యావరణాన్ని పరిరక్షణతో దేవుణ్ణి పూజించాలన్నారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల వద్ద పిల్లలు, యువత జాగ్రత్తగా ఉండాలన్నారు.

## చేయూత పింఛన్ల పంపిణీకి పటిష్ట చర్యలు
**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ టౌన్, ఆగస్టు 26, ప్రభాతవార్త :**
కలెక్టర్ ఛాంబర్ లో మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ అధికారుల ద్వారా111 శాంసన్ 12 బితీ ఫోన్ లు, మంత్ర వేలిముద్రల మిషన్ తో పాటు పవర్ అడాప్టర్ ఇతర సామాగ్రి కలెక్టర్ అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చైత పింఛన్లు పోస్టల్ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.జూలై 2025 మాసము నుండి పింఛనుదారులకు ముఖ వర్చస్తు ద్వారా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకం అయిన చేయూత పింఛను, ప్రతి నెల నిర్ణీత గడువులోపు సంబంధిత లబ్దిదారులకు మంజూరైన రొక్కము అందజేయుటకు చర్యలు తీసుకుంటూ, ప్రణాళికా బద్దంగా ఎలాంటి లోటుపాట్లకు తావివ్వ కూడదని చూడాలని కలెక్టర్ వివరించారు.మెదక్ జిల్లా పరిధి క్రింద గల మొత్తం 1.12 లక్షల పింఛను దారులలో 50,580 వరకు సంబంధిత గ్రామ పోస్టాఫీసు ద్వారా గ్రామ పరిధి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లచే మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో పెన్షన్ రంగాచారి పెన్షన్ సెక్షన్స్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టల్ ద్వారా పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

# ఇందిరమ్మ ఇళ్లకు నాణ్యమైన ఇసుక పంపిణీ

**వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**


మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సాండ్ బజార్‌లను ఏర్పాటుచేసి నాణ్యమైన ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మంగళవారం అందోలు శివారులో మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న నిధులతోపాటు నిర్మాణ వ్యయం కలిసొచ్చే విధంగా ఈ సాండ్‌బజార్‌లకు రూపకల్పన చేసిందని పేర్కొన్నారు. పేదలకు సాధ్యమైనంత మేరకు ఆదుకోవాలనే సదుద్దేశంతో ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, దీని వల్ల ఒక ఇందిరమ్మ ఇంటికి గరిష్ఠంగా నలభైటన్నుల ఇసుకను కేవలం టన్నుకు రూ.1200లకే పంపిణీ చేస్తారని తెలిపారు. దీనివల్ల ఇందిరమ్మ ఇంటి లబ్దిదారుకు మొత్తం ఖర్చులో కనీం యాభైవేలు కలిసి వస్తుందని చెప్పారు. దళారీల బెడద లేకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. సొంత ఇల్లు అనేది ప్రతి పేదవాడి కల అని, దానిని సాకారం చేయటంలో తమ ప్రభుత్వం ఎల్లపుడు ముందుంటుందని పేర్కొన్నారు. గతంలోనూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు లక్ష ఇండ్ల నిర్మాణం చేశామని, ప్రస్తుతం నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని, ఇప్పటికీ ఇంకా ఎవరికైనా ఇండ్లు మంజూరు కాకపోతే నిరాశ చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అంతకుముందు ప్రత్యేక పూజలుచేసి ఇసుక పంపిణీని ప్రారంభించారు. అలాగే నూతనంగా ఏర్పాటుచేసిన కాంటాను, నాలుగు వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, టిజిఎండిసి ఎండి భూకేష్‌మిశ్రా, ఏడి రఘుబాబు, పివో శ్రీకాంత్,ఏఎంసి చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ మధుకర్‌రెడ్డి, ఎంపిడిఓ రాజేష్, మున్సిపల్ కమిషనర్ రవీందర్,పిఏసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రంగసురేష్‌గుప్త, సురేందర్ గౌడ్, డాకూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలలో పనుల గురించి తెలుసుకుంటున్న మంత్రి

## విద్యారంగ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం
**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**జోగిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:** అందోలు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని విద్యాసంస్థల అధికారులతో అందోలులోని పాలిటెక్నిక్ కళాశాలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, అలాగే మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అవసరమైన వసతులు తప్పనిసరిగా కల్పించాలని చెప్పారు. సౌకర్యాలు సక్రమంగా ఉంటేనే విద్య సజావుగా సాగుతుందని ఆయన పేర్కొన్నారు.అక్సాన్‌పల్లి, పోతులబోగుడ, బస్వాపూర్ మోడల్‌స్కూళ్లు, అందోలు బాలికల రెసిడెన్షియల్ స్కూల్, సింగూరు బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లోని సౌకర్యాలపై విస్తృతంగా చర్చించారు. ఆహారం, క్రీడా సదుపాయాల నాణ్యత మరింత మెగరుపరిచే దిశగా సూచనలు చేశారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ మరియు పిజి కాలేజ్ ఫర్ ఉమెన్, బుదేరా విద్యాసంస్థ ప్రాధాన్యంపై మంత్రి ప్రత్యేంగా చర్చించారు. ఈ కళాశాలలో అదనపు గదుల నిర్మాణం, వసతి సదుపాయాల పెంపు, డార్మెటరీ సౌకర్యాలు, డైనింగ్ హాల్ విస్తరణ, నూతన కిచెన్ పరికరాలు, ల్యాబ్ సామాగ్రి వంటి అవసరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిధులు నిర్మాణాలు మావి..ప్రారంభోత్సవాలు మీవా..
**మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి**


మాట్లాడుతున్న మహారెడ్డి భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** నిధులు నిర్మాణాలు మావి.. ప్రారంభోత్సవాలు మీవా అని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తండాలను, చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన ఘనత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఉదాహరణకు ఉమ్మడి కల్హేర్ మండలంలో ఇందిరానగర్, మహాదేవ్ పల్లి, ఖానాపూర్(రే), మునిగేపల్లి గ్రామాలలో నిర్మింపచేశారు. ఇంకా చాలా గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాలు, కమ్యూనిటీ భవనాలను, నిర్మించాము. ఈరోజు మీరు ప్రారంభించిన గ్రామపంచాయతీ భవనం గత ప్రభుత్వంలో శాంక్షన్ చేయించి దాని పనులను ప్రారంభించామన్నారు. దాని నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఈరోజు మీరు ప్రారంభం ఉత్సవంలో పాల్గొని అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నారాయణఖేడ్ నియోజక వర్గంలో ఏ ఒక్క గ్రామపంచాయతీలో ఏ పని నిర్వహించారు? మీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఏ గ్రామపంచాయతీకి 30 లక్షల నిధులను కేటాయించారో చెప్పాలన్నారు. మీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా పంచాయతీ కార్యదర్శులు సొంతగా వారి డబ్బులను ఖర్చు చేసి అప్పుల పాలై ఈరోజు మీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చారని తెలిపా. ఇప్పటికైనా మీరు మీ ముఖ్యమంత్రితో మాట్లాడి గ్రామపంచాయతీ కార్యదర్శుల బాధలను తీర్చి, ప్రతిపక్ష నాయకుల మీద బురద జల్లే ప్రయత్నాలు ఆపి నిజాలు మాట్లాడడం మొదలు పెట్టాలని కోరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై నిర్మాణం చేసిన భవనాలను ప్రారంభించి నీవు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం కాదు నీకు దమ్ముంటే నీవు కొత్తగా అభివృద్ధి పనులను మంజూరు చేయించి చూపించాలని అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో కల్హేర్, కరస్‌గుత్తిలో 30 దవాఖాన అప్ గ్రేట్ చేసి నిర్మించడం జరిగిందన్నారు. అలాగే నిజాంపేట్, సిర్గాపూర్‌లో కోటీ 50 లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాలను నిర్మించామని, అలాగే నారాయణఖేడ్‌లో 100 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఆక్సిజన్ ప్లాంట్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాము మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గానికి ఏ ఒక్క కొత్త పనులను ప్రారంభించారో చెప్పాలని నియోజకవర్గ ప్రజలు అడుగుతున్నారరని అనానరు. దీనికి సమాధానం చెప్పాలన్నారు.


వవినాయకుడి ఆకారంలో విద్యార్థులు

## కృష్ణవేణి పాఠశాలలో వినాయక ఆకృతి

**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త :** స్థానిక కృష్ణవేణి పాఠశాలలో వినాయక చవితి సందర్బంగా విద్యార్థులు వినాయకుడి అకృతిథితో కనువిందు చేసారు.ఈ కార్యక్రమం లో 150 మందికి పైగా విద్యార్తులు పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ ఉపధ్యాయుల పాల్గొన్నారు.

**నియోప్రగతి పాఠశాలలో...**




**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త :** నియోప్రగతి ఉన్నత పాఠశాలలో వినాయక చతుర్థి పురస్కరించుకొని విద్యార్థులు చిన్ని గణపయ్య ఆకృతి చేయడం జరిగింది. ఈ ఆకృతిలో పాఠశాల చైర్మన్ గుండాచారి, కరస్పాండెంట్ కమ్మరి వెంకటరత్నం, ప్రిన్సిపల్ కమ్మరి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది

## యూరియా కోసం రైతుల ధర్నా
**పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి.. అరెస్ట్ చేసిన పోలీసులు**


నర్సాపూర్ చౌరస్తాలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** యూరియా కొరతను నిరసిస్తూ రైతులు మంగళవారం నర్సాపూర్ చౌరస్తావద్ద రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. అదే సమయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి నర్సాపూర్ మీదుగా గోమారం వెళుతుండగా రైతులు,నిరసనకారులు ఎమ్మెల్యే సునీతారెడ్డి వాహనాన్ని ఆపి యూరియా అందడంలేదని మొరపెట్టుకున్నారు. ఈమేరకు స్పందించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్బంగా ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయి రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే సునీతారెడ్డిని అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ మూడు రోజులుగా వివిధ గ్రామాల నుండి రైతులు యూరియా కోసం వస్తున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం ఆరుగంటల నుండి తిండీ తిప్పలు లేకుండా సాయంత్రం వరకు క్యూలో నిలబడితే ఒక్క బస్తా యూరియా కూడా రైతులకు అందడం లేదన్నారు. దీంతో నిరాశ చెందిన రైతులు నేడు రోడ్లమీదకు రావడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వానికి ముందుచూపుతో ప్రణాళిక లేనందువల్లే ఈ పరిస్థితి దాపురించిందని తెలిపారు. ఒక బస్తా యూరియా రూ. 260 సంచిని రూ. 400 దళారులను ఆశ్రయించి రైతులు కొనుగోలు చేసి నష్టపోతున్నారని వాపోయారు. తక్షణమే రైతులకు సరిపడ యూరియా ఇవ్వాలని, లేనిపక్షంలో భారీఎత్తున రైతులతో తీవ్ర నిరసనలు ఉంటాయని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు, రైతులకు యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సునితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు సత్యంగౌడ్, ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు భోగ శేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, నాయకులు పడిగే నర్సింలు, అందూరి గణేష్, సుధాకర్‌రెడ్డి, సుదీప్ తదితరులు పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులకు నచ్చచెబుతున్న పోలీసులు

## బాధితుడిని ఆదుకునేవారే లేరా...!?
**మిషన్ భగీరథ పంప్‌హౌజ్ ఎదుట గ్రామస్థుల నిరసన**

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలోగల మిషన్‌భగీరథ పంప్‌హౌజ్‌లో ఐదురోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురైన ముగ్గురిలో ఎడవెల్లి శ్రీకాంత్ తీవ్రగాయాలై ప్రాణాపాయస్థితికి చేరడంతో విషయం కాంట్రాక్టర్‌కు వివరించిన పంప్‌హౌజ్ ప్రాజెక్టు మేనేజరు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో తనను కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే బాధిత వ్యక్తి పేదవాడని, కాంట్రాక్టర్, అధికారులు ఆసుపత్రి ఖర్చులు పూర్తిగా భరించాలని పంప్‌హౌజ్ ఎదుట గ్రామస్థులు నిరసన తెలపడంతో పూర్తి ఖర్చులు భరిస్తానని చెప్పిన కాంట్రాక్టర్ ఇప్పటివరకు ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడకపోవడంతో మంగళవారం గ్రామస్థులతో పాటు అతడి కుటుంబ సభ్యులు మరోసారి పంప్ హౌజ్ ఎదుట ఆందోళనకు దిగారు. అయితే ఈ విషయంలో పంప్‌హౌజ్ కాంట్రాక్టర్ హుస్నాబాద్ పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పంప్‌హౌజ్ కాంట్రాక్టర్‌కు, సంబందిత అధికారులు, అధికార పార్టీ నాయకులతో పరిచయాలు ఉన్నాయని ఇది వరకు కూడా పంప్‌హౌజ్‌లో ఎంతో మందికి ప్రమాదాలు జరిగినా వారి అండతోనే ఏఒక్కరిని పట్టించుకోలేదన్నారు. ఈవిషయంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఉన్నతాధికారులు స్పందించి బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగేవిధంగా చూడాలని వేడుకున్నారు.

# ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలి
**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**


డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి(నారాయణరావుపేట):**
నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంట్లో చెత్త చెదారం, ఇంట్లో, బయట ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, అవసరం లేని సామాగ్రిని తీసివేయాలని నీటి నిల్వ ఉండకుండా అధికారులు తెలిపిన సూచనలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ప్రతి ఇంటికి అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల రాకుండా తగు జాగ్రత్తలు తీసుకవోవాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. లబ్దిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఆమె వెంట వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**మట్టి వినాయకులను పంపిణీచేసిన కలెక్టర్...**
**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం రామచంద్రపురం ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతీమలను కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి గణపతులను ప్రతిష్టిస్తే తద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కావని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడడంలో అందరు భాగస్వాములు కావాలన్నారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా విద్యాలయంలో ఘనంగా వినాయకపండుగ

-మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసిన విద్యార్థులు




మట్టి వినాయకులతో మంజీరా విద్యార్థులు

**రామాయంపేటమున్సిపాలిటీ, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

రామాయంపేట పట్టణంలోని మంజీరా విద్యాలయంలో మంగళవారం వినాయకపండుగను జరపడం జరిగింది. ఇందులోభాగంగా మట్టి వినాయ కులని ఎంతోశ్రద్ధతో విద్యార్థులు నేర్పించడం జరిగింది. వినాయక పండుగను గురించి వివరించడం జరిగింది. పత్రిని వినాయకునికి సమర్పించుకోవడం వెనక సైన్స్ రహస్యాలు విద్యార్థులకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, కరస్పాం డెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి, మోనిక, మీనా తదితరులు పాల్గొన్నారు.

## ఐరన్ కరెంట్ పోల్స్ తొలగించాలి

-మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్



తొలగించాల్సిన ఐరన్ కరెంట్ పోల్స్ దృశ్యం

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో ప్రమాదకరంగా మారిన ఐరన్ కరెంట్ పోల్స్ తొలగించాలని నర్సాపూర్ మాజీ మున్సిపల్‌చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అధికారులకు వినతిచేశారు. ఈసందర్భంగా దుర్గప్పగారి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో సుమారు 30నుండి 40వరకు ఐరన్ కరెంట్ పోల్స్ ఉన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున ఈ ఐరన్ కరెంట్‌పోల్స్‌తో కరెంట్‌షాక్ తగిలే ప్రమాదం ఉన్నందున వెంటనే తొలగించాలని నర్సాపూర్ విద్యుత్‌శాఖ ఎడి ఈ.రమణారెడ్డికి, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డిలకు వినతిచేశారు. ఐరన్ కరెంట్ పోల్స్ వల్ల కరెంట్‌షాక్ తగిలే ప్రమాదం ఉందని గతంలో ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు వినతిచేసినా ఫలితంలేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే ఈ ఐరన్ కరెంట్‌పోల్స్‌ను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ విజ్ఞప్తిచేశారు.

## రోడ్డు ప్రమాదంలో డిఈ ప్రశాంత్‌కుమార్‌కు తీవ్రగాయాలు

-పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రశాంత్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**గజ్వేల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

నర్మెట్ట వద్ద ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించేందుకు వెళ్తున్న సంబంధిత డిఈ ప్రశాంత్‌కుమార్‌కు మంగళవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తుండగా అదే రోడ్డువెంట వెళ్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమాచారం అందడంతో గజ్వేల్‌కుచేరుకొని ప్రశాంత్‌కుమార్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ అన్నపూర్ణను అడుగగా చేయి విరిగిందని తెలిపారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం ప్రశాంత్‌కుమార్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన సొంత వాహనంలో హైద్రాబాద్‌కు తరలించారు. అలాగే గాయాలైన ఆయిల్‌ఫామ్ అధికారులు శ్రీనివాస్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డిలకు ప్రథమచికిత్స నిర్వహించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆయనవెంట జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్‌లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌గుప్త, కాంగ్రెస్ ప్రచారకమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, రేగొండగౌడ్, బెజుగామ శివారెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, మైనార్టీ నాయకుడు అజ్గర్, గుంటుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

-బిజెపి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**వర్గల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బిజెపి వర్గల్ మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్‌దారులకు పెంచుతామన్న పెన్షన్‌ను వెంటనే పెంచాలని, అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అమలు చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, ఉపాధ్యక్షుడు జంగం యాదగిరి, దిండి నాగరాజు, కార్యవర్గ సభ్యులు టేకులపల్లి నరేందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు బొప్పిడి సుధాకర్‌రెడ్డి, నర్ర రవి, నూక బద్రినాథ్, రేణుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు13న లోక్ అదాలత్

**సిర్గాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

సెప్టెంబరు 13వ తారీఖున నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని జెఎఫ్‌సిఎం కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సిఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. రాజీ చేసుకునే ఇరువర్గాల వారు ఈ నెల 28వ తారీఖు నుంచి సెప్టెంబరు 13 వరకు పోలీసు ఠాణాలో లేదా కోర్టులో హాజరయితే కేసును రాజీ కుదర్చడం జరుగుతుందన్నారు. యాక్సిడెంట్, కొట్టుకున్న, చీటింగ్, భూతగాదాలు, వివాహబంధానికి సంబంధించిన, చిన్నచిన్న దొంగతనాలు, అక్రమరవాణా (ఇసుక,మట్టి,కట్టెలు,మద్యం తదితర), పేకాటలాంటి కేసులను రాజీచేసుకోవచ్చన్నారు. కేసులను రాజీ కుదుర్చుకునేందుకు ఇరువర్గాల వారు తమ ఆధార్‌కార్డులతో పోలీసు ఠాణా, లేదా కోర్టుకు హాజరుకావాలని సిఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

# రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి

-మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు వినతిచేసిన బిజెపి నాయకులు



ఎంపి రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న నర్సాపూర్ బిజెపి నాయకులు

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

గ్రామాలలోని రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నర్సాపూర్ బిజెపి నాయకులు హైదరాబాదులోని రాష్ట్ర బిజెపి పార్టీ కార్యాలయంలో మెదక్ ఎంపి రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులుగా బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్‌దాస్ రాధామల్లేష్ గౌడ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌తో పాటు బిజెపి నాయకులు కలిసి రోడ్ల మరమ్మతులకై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలోని కొండాపూర్ నుండి కాగజ్ మద్దూర్, నత్నాయపల్లి మీదుగా పలుగుపోచమ్మ ఆలయం నుండి షేర్‌ఖాన్‌పల్లి గ్రామం వరకు రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ఆర్టీసీ బస్సులు నడవటం లేదని దీంతో ఈ ఐదుగ్రామాల ప్రజలు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈమేరకు ఈరోడ్ల మరమ్మతులకు గాను నిధులు మంజూరుచేసి రోడ్లను బాగు చేయించాలని వారు ఎంపి రఘునందన్‌రావును కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేష్‌తోపాటు జిల్లా ప్రధానకార్యదర్శి సంఘసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, రాజేందర్, జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్, జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల, మాజీ కౌన్సిలర్ ఎర్రగుళ్ల రమేష్‌యాదవ్ బిజెపినాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో 20మందికి గాయాలు

-కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన అధికారులు



వీధికుక్కలను మెదక్‌కు తరలిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

**వెల్దుర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం వీధికుక్కలు దాడి చేయగా సుమారు 20మందికి గాయాలయ్యాయి. గాయాలైనవారిని ఆసుపత్రికి తరలించారు ఈవిషయమై జిల్లా కలెక్టర్ స్పందించి బుధవారం మాసాపేట గ్రామంలో తిరుగుతున్న వీధికుక్కలను డిఎల్పిఓ యాదయ్య, తహసీల్దార్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో మెదక్ మున్సిపాలిటీ సిబ్బంది మాసాపేట గ్రామపంచాయతీ సిబ్బంది కలిసివీధి పట్టుకొని మెదక్‌కు తరలించారు. బుధవారం వీధికుక్కల దాడికి చికిత్సపొందుతున్నవారిని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి బాగాలేనివారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## 9రోజులకు గణేష్ నిమజ్జనం

-తీర్మానం చేసిన గణేష్ ఉత్సవ కమిటీ



గణేష్‌నిమజ్జనంపై సమావేశం అయిన అధికారులు, సార్వజనిక్‌కమిటీ

**జహీరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే వినాయక నవరాత్రి ఉత్సవాలను ఈ సెప్టెంబర్ 4వ తారీఖున ముగింపు (నిమజ్జనం) చేయాలని గణేష్ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి.సుభాష్‌రావు, డిఎస్‌పి బి.సైదానాయక్, తహసీల్దార్ పి.దశథ్‌లను కోరారు. కార్యక్రమంలో సార్వజనిక్ అధ్యక్షులు సంగప్పముదిరాజ్, ప్రధానకార్యదర్శి రంగా అరుణ్‌కుమార్, సలహాదారు గొల్ల భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, కమిటీ బాధ్యులు మహేందర్ గోడ్కె, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, విజయేందర్ రెడ్డి, రమేష్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి రూపంలో పాఠశాల విద్యార్థులు



బాలలంతా కలిసి బాల గణేష్ రూపంలో..

**పాపన్నపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మంగళవారం పాఠశాల ఆవరణలో బాలలంతా కలిసి బాల గణేష్ రూపంలో కూర్చుని అందరినీ ఆకట్టుకున్నారు. గణేష్ ఆకారంలో కూర్చుని గణనాయక గణాధ్యక్షాయ పాటపై డాన్స్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్‌గుప్తా, కరస్పాండెంట్ నిటలాక్షప్ప, సుమన్, పిఈటి ఉపేంద్ర, కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

-మెదక్ ఎస్‌పి డివి శ్రీనివాసరావు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాస్‌రావు

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అదేవిధంగా విద్యార్థులు మత్తుపదార్థాలకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మెదక్ ఎస్‌పి డివి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటి ర్యాగింగ్, మత్తుపదార్థాలు, సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది నేరమని పేర్కొంటూ, ఇది మనసంస్కృతి కాదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదుచేసి విద్యాసంస్థలనుండి తొలగించబడతారన్నారు. అదేవిధంగా మత్తు పదార్థాల వాడకం, రవాణా, విక్రయాలకు పాల్పడిన వారికి 10సంవత్సరాల జైలుశిక్ష, జరిమానాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు సైబర్‌నేరాల పట్ల అప్రమత్తత, అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలకు మోసపోయినట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదుచేయాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్‌పి ఎస్. మహేందర్, కళాశాల ప్రిన్సిపాల్ వాసుదేవ్, సైబర్‌క్రైమ్ డిఎస్పి సుభాష్ చంద్రబోస్, తూప్రాన్ డిఎస్పి నరేందర్‌గౌడ్, నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ బి.లింగం తదితరులు పాల్గొన్నారు.

## నానోయూరియా వాడకంపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎవో రాజశేఖర్‌గౌడ్

**వెల్దుర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన మాసాయిపేటలో బుధవారం స్థానిక ఎవో రాజశేఖర్‌గౌడ్, రైతులకు నానోయూరియాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నానోయూరియా ఆధునిక సాంకేతికపరిజ్ఞానంతో తయారుచేయబడినటువంటి ప్రత్యేకరకమైన ద్రవరూపమైన ఎరువు అన్నారు. దీనివల్ల పంటల దిగుబడిపై గణనీయమైన సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. రైతులకు అతితక్కువఖర్చుతో ఈద్రవరూప ఎరువులను వాడడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని అధిక దిగుబడిని పొందవచ్చు అని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎఈఓ రజిత, రైతులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై రైతుల ధర్నా



ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

**శివ్వంపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

రైతులు పిఎసిఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వరుసలో బారులు తీరి యూరియా దొరకకపోవడంతో నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ యూరియా అందించేవరకు ధర్నా నిర్వహిస్తూనే ఉంటామని ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని వెంటనే యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న రైతుల వద్దకు పోలీసులు చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను ముగించారు.

# పాపన్నపేట ఆర్ఐని తక్షణం సస్పెండ్ చేయాలి...

-గిరిజన సంఘాల డిమాండ్

**పాపన్నపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

పౌతి కోసం మండల కార్యాలయానికి వచ్చిన గిరిజన రైతులను అకారణంగా పోలీస్‌స్టేషన్‌కు పంపి రాత్రి 8గంటలవరకు పోలీస్‌స్టేషన్లో ఉంచిన పాపన్నపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్‌చేసి సమగ్రవిచారణ జరిపించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా బంజారా సేవలాల్ సంఘ కార్యదర్శి రాజునాయక్, మెదక్ జిల్లా అధ్యక్షులు రమేష్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూల్‌సింగ్ డిమాండ్ చేశారు. సొంత తల్లికి సంబంధించిన పొలాన్ని కొడుకుపేర పౌతి చేయడానికి 15రోజులుగా వేధించడమే కాకుండా, ఇంత ఆలస్యం ఎందుకని ప్రశ్నించినందుకు బాధిత గిరిజన రైతులను మధ్యాహ్నం మూడు గంటల నుండి రాత్రి 8గంటల వరకు భోజనం లేకుండా పాపన్నపేట పోలీస్‌స్టేషన్లో ఉంచిన ఆర్ఐని సస్పెన్షన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని పనికోసం వచ్చిన రైతులను పోలీస్‌స్టేషన్‌కు పంపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ను వెంటనే సస్పెండ్‌చేసి సమగ్రవిచారణ జరిపించాలని వారు డిమాండ్‌చేశారు. లేకపోతే ఉమ్మడి జిల్లాలోని గిరిజనులతో కలిసి మెదక్ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

### ఎమ్మార్పీఎస్ హెచ్చరిక...

పౌతి కోసం వెళ్లిన గిరిజన రైతులను పాపన్నపేట పోలీస్‌స్టేషన్లో రాత్రి 8 వరకు ఉంచిన పాపన్నపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ తక్షణం సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అల్లారం రత్నయ్య డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ బాలరాజు, రాష్ట్రకార్యదర్శి సిద్దిపేట బాబురావు, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ పల్లె కిష్టయ్యలు మాట్లాడుతూ రైతులను భయభ్రాంతులకు గురిచేసి, తప్పయినట్లు రైతుతో ఒప్పంద పత్రం రాయించుకున్న ఆర్ఐని సస్పెండ్ చేయాలని లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## జడ్పిహెచ్‌ఎస్ విద్యార్థులకు నోటు పుస్తకాలు

**రామచంద్రాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కేసిఆర్ డబుల్ బెడ్ రూం ఫేజ్ 1, 2లోగల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు భూమి ఆకాశం ఆర్ఫనేజ్ ట్రస్ట్ సహకారంతో బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో 2500 నోటుపుస్తకాలను (ఒక్కోవిద్యార్థికి 6చొప్పున) సోమవారం పంపిణీచేశారు. విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీతోపాటు పాఠశాలకు 8రైటింగ్‌బోర్డులు సైతం అందచేశారు. పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాథోడ్, తెల్లాపూర్ బిఆర్ఎస్ అధ్యక్షులు దేవేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఉమేష్ బాబ్జి, శ్రీశైలం, రవీందర్‌రెడ్డి, సాగర్, మాజీ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ మధు, బిఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షులు చెన్నారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, ఇంద్రరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, డబుల్ బెడ్‌రూం ఇంచార్జిలు అక్బర్‌ఖాన్, రాజు, ఇమ్రాన్, షకీల్, లక్ష్మణ్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందచేసిన సాగర్ శెట్కార్

**మనూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సూచనల మేరకు మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన మంగ గాలప్పకు 60వేల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ, శాంతప్ప తదితరులు పాల్గొన్నారు.

## గార్డెన్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



రెవంరెండ్ బిజి గార్డెన్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ వ్యవస్థాపకులు, రెవరెండ్ జార్జ్ బి. గార్డెన్ 33వ వర్ధంతిని పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ గార్డెన్ కాలనీలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గార్డెన్ కాలనీలోని విగ్రహానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, పట్టణ అధ్యక్షులు శివప్ప, మాజీ పట్టణ అధ్యక్షులు మోహియుద్దీన్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు రవికిరణ్, నాయకులు దీపక్, వినోద్, ప్రభాకర్, మోహన్, ప్రవీణ్, చింటు, సురేష్, ప్రశాంత్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## గార్డెన్‌కు నరోత్తం నివాళులు



గార్డెన్‌కు నివాళులర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్ వ్యవస్థాపకులు, రెవరెండ్ జార్జ్ బి. గార్డెన్ వర్ధంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గార్డెన్ కాలనీలోని విగ్రహానికి ఎస్సికార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామెల్, రాజు, యస్ గోపాల్, పాస్టర్‌లు, క్రిష్టియన్ పెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

-జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న డిఈఓ

**సదాశివపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ఉద్యోగ నిర్వహణలో మనం చేసిన సేవలే గుర్తింపునిస్తాయని. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కిష్టాపురం ఉమారాణి పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఉమారాణి ఉద్యోగనిర్వహణలో అంకితభావంతో నిబద్ధతతో అందించాలని ప్రశంసించారు. కార్యక్రమంలో మండలవిద్యాధికారి ఎన్.శంకర్, జిహెచ్‌ఎం ప్రెసిడెంట్ సంజీవ రావు,జిహెచ్‌ఎంజనరల్‌సెక్రెటరీ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

**వర్గల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను పట్టుకున్న సంఘటన వర్గల్‌గ్రామ శివారులో చోటుచేసుకుంది. గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వేలూరు గ్రామానికిచెందిన అరిగె ఆంజనేయులు(22), కేశవనగర్ కాలనీ తూప్రాన్‌కు చెందిన తుమ్మల ప్రశాంత్(20), భగత్‌నగర్ కాలనీ తూప్రాన్‌కు చెందిన విద్యార్థి మామిడి నికిత్‌రెడ్డి(19)లు ముగ్గురు కలిసి వర్గల్ గ్రామ శివారులో మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని వారిని తనిఖీ చేయగా వారి వద్ద 93 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారి వద్ద ఉన్న గంజాయితో పాటు మోటార్ సైకిల్, నాలుగు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



మల్లన్న ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## కొమురెవెల్లి మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

**ఆదాయం రూ.45,79,870 నగదు, 44 గ్రాముల బంగారం, 4 కిలలో వెండి**

**కొమురవెల్లి, ఆగస్టు 26,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొముర వెల్లి మల్లికార్జునస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 46రోజుల హుండీ ఆదాయంలో రూ.45,79,870 నగదు, 44 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలలో 300 గ్రాముల మిశ్రమ వెండి, 83 విదేశీ కరెన్సీ వచ్చాయి.కార్యక్రమంలో ఈవో అన్నపూర్ణ,అధికారులు విజయలక్ష్మీ, బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు జయప్రకాష్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, చిగిరి కొమురయ్య, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, శివరామకృష్ణ భజన మండలి సేవ సమితి సేవ సభ్యులు, అర్చకులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బెజ్జంకి, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరులో పైలెట్‌ప్రాజెక్ట్‌గా ఎంపికైనా వీరాపూర్ గ్రామాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి సందర్శించి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు గూడు నిర్మించి ఇవ్వడానికే సర్కారు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. వీరాపూర్ గ్రామంలో 79 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో మొదటగా గృహప్రవేశం చేసిన లబ్దిదారులకు నూతన వస్త్రాలతో పాటు రూ.10వేల నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, మిట్టపల్లి చెన్నారెడ్డి, గన్నమనేని సుధీర్‌రావు, తాళ్లపల్లి తిరుపతి,గౌడ్, చిలుముల దేవదాస్, అంజయ్య, హరీష్, సందీప్, శంకర్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు తప్పని తిప్పలు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్

**చిన్నకోడూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు రైతులకు కష్టాలు తప్పడం లేదని బిఆర్ఎస్ నేత జంగిటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ, బిఆర్ఎస్ హయాంలో ఏనాడూ యూరియా కొరత రాలేదని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే యూరియా కొరత ప్రారంభమైందన్నారు. నాడు లేని యూరియా కొరత నేడు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక చొరవతోనే సిద్దిపేట నియోజకవర్గానికి ఈ మాత్రం యూరియా దొరుకుతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో రైతులకు సకాలంలో యూరియా, విత్తనాలు, పంటల పెట్టుబడి సహాయం అందిందని తెలిపారు. రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. రైతులను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సమయం వచ్చినప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## ప్రతిపక్షాలను జైలుకు పంపించే కుట్ర చేస్తున్న బిజెపి

**బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్**

**హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 130వ రాజ్యాంగ సవరణ పేరుతో ప్రతిపక్షాలను జైలుకు పంపించే కుట్రలు చేస్తుందని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ పేరుతో మోడీ ప్రభుత్వం తమకు అనుకూలంగా లేని పార్టీల నాయకులను కేసుల్లో ఇరికించి 30 రోజులు జైలు నుంచి రాకుండా చేయడంతో పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వాలను కూల్చాలనే కుట్ర చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చిల్లర వ్యవహారాలు చేయడం ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. కేంద్రానికి ప్రజలకు ఏదైనా మంచి చేయాలనిపిస్తే దేశ వ్యాప్తంగా న్యాయ వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ, పోలీస్ వ్యవస్థలను స్వతంత్ర్య వ్యవస్థలుగా మార్చాలన్నారు. అప్పుడే దేశంలోని ప్రజలకు ఏదైనా న్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**తహసీల్దార్‌కు బిజెపి శ్రేణుల వినతి**

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైందని, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 24 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీలను అమలుచేయక ప్రజలను మోసం చేస్తుందన్నారు, మహిళలకు నెలకు రూ.2500, వృద్ధులు, వితంతువుల పించన్లు రెండు వేల నుండి నాలుగు వేలు, నాలుగు వేల నుండి ఆరు వేలకు పెంచడంతో పాటు రైతు భరోసా కింద ఎకరాకు 15వేలు, కూలీలకు రూ 12 వేల సహాయం, విద్యార్థులకు 5లక్షల భరోసా కార్డుతో పాటు ఇచ్చిన 420 హామీలు అమలుచేయాలని లేనిపక్షంలో ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, నాగార్జున్, దీపికా, సాయిరాం, రాజు, అనంతస్వామి, సంతోష్, శ్రీనివాస్, శారద, నరేష్, లక్ష్మణ్, రాజేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

# కేంద్రం నిర్లక్ష్యంవల్లే యూరియా సమస్య

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యయాదవ్**

**గజ్వేల్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యయాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ శివారులో ఎస్4 హోటల్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి గజ్వేల్ నియోజకవర్గ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉస్మానియా యూనివర్సిటీని భ్రష్టు పట్టించగా, చక్కదిద్దేక్రమంలో అడుగుపెట్టి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రేవంత్‌రెడ్డి సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయాలతో ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, బిఆర్ఎస్ పార్టీ మూడుముక్కలాటను మరిచిపోతున్నట్లు విమర్శించారు. వారి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు బయటపెడతామని అన్నారు. కెటిఆర్ బిజెపికి వత్తాసు పలుకుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా సమస్య ఏర్పడిందని, ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టడం సిగ్గుచేటన్నారు. మోడి భయంతో బిఆర్ఎస్ నాయకులు వారి పాట పాడుతున్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాచారం చైర్మన్ రవీందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యయాదవ్



తహసీల్దార్ సలీంమియాకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

## ఆరు గ్యారెంటీలను అమలు చేసేవరకు పోరాటం

**బిజెపి మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్**

**చిన్నకోడూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సలీంమియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూరగోని శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను పేదలకు ఇవ్వడం లేదని అనర్హులకే కేటాయిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సర్కారు గ్యాస్ సబ్సిడీ ఎత్తి వేసి నిరుపేదలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.ఎన్నికల్లో చేత గానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం కాదు హామీలు నెరవేర్చి న్యాయం చేయాలన్నారు.కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు బిజెపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాపయ్య, రాజిరెడ్డి, సంతోష్, క్రిష్ణ, బాలయ్య, సంజీవులు, నరేందర్, సందీప్, రాజు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**-బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని మంగళవారం బిజెపి నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఎంపి రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ల ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో ఎలాంటి అవకతవకలు లేకుండా అర్హులైన వారికి అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, అసెంబ్లీ కో-కన్వీనర్ ఎల్కంటి సురేష్, మండల సీనియర్ నాయకులు వంజరి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మన్నె శేఖర్, చెప్యాల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బారు అరవింద్, మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శాతం స్వామి, మండల కార్యదర్శి కూర స్వామి, బిజెవైఎం నాయకులు అనిల్, మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, గణపతి, శివప్రసాద్, రామస్వామి, రాజు, అరవింద్‌రెడ్డి, మహేష్, కనకయ్య, మల్లేశం, మహేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని రక్షిద్దాం

**కొండపాక, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రవి అన్నారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయన మట్టి వినాయకుల తయారీపై విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పిఒపితో చేసిన వినాయకుల విగ్రహల వల్ల కాలుష్యం ఏర్పాడుతుందన్నారు. పిఒపితో తయారు చేసిన విగ్రహల వల్ల వాతవరణతోపాటు నీటి కాలుష్యం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను తయారు చేసి వాటినే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




చేర్యాల సహకార సంఘం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

## యూరియా అందుబాటులో ఉంచాలని ఆందోళన

**చేర్యాల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** రైతులకు కావలిసినంత యూరియాను అందుబాటులో ఉంచాలని తెలంగాణ రాష్ట్రసంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం చేర్యాల పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు భాస్కర్‌రెడ్డితో పాటు రైతులు ఆందోళన చేపట్టారు.రైతులు రెండు రోజులుగా యూరియా కావాలని తిరిగినా కూడా ఒక్క బస్తాకూడా అందించడం లేదని తెలిపారు.ఇప్పటికైన సంబంధిత అధికారులు రైతులకు యూరియా అందేలా చూడాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆందోళన చేపట్టిన వారిలో పొనుగోటి శ్రీనివాస్‌రెడ్డి,బండారి బాలయ్య, నరసింహులు, బుద్ది మల్లయ్య, సతీష్, చంద్రయ్య, వ్యాసరేని రాములు, వ్యాసరేణి రాములు, ఏగుర్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని బిజెపి ఆందోళన

**చేర్యాల, ఆగస్టు 26, ప్రభాతవార్త :** పట్టణంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంగళవారం బిజెపి నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, దండ్యాల లక్ష్మారెడ్డి, బూరుగు సురేష్‌గౌడ్, పోతుగంటి రాందాసు, మండలాధ్యక్షులు వడ్లకొండ సంజీవులు, పూర్మ సంజీవరెడ్డి, కొట్టె చంద్రమౌళి, సయ్యద్ షాదుల్లా, వెలుగల రమేష్, ఖాత నాగరాజు ఉన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

**డిఇవో రాధాకిషన్**



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

**పెద్దశంకరంపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త :** చదువుతోపాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు నిత్య సాధన చేయాలని సూచించారు. చిన్నతనం నుంచి గెలుపోటములు అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా తట్టుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఓటమి చెందామని నిరుత్సాహపడకుండా గెలుపు కోసం ప్రయత్నించి క్రీడాస్ఫూర్తిని చాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, మారుతివిట్టల్, కుమార్, శ్రీనివాస్, ఆనంద్,గోపి, సిద్ధిరాములు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎటిసిలో చేరడానికి చివరి తేదీ 30

**కొండపాక, ఆగస్టు 26, ప్రభాతవార్త :**

ఎటిసిలో చేరడానికి ప్రభుత్వం మరింత గడువును పొడిగించిందని కుకునూరుపల్లి ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటిసిలో మిగిలి ఉన్న కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఫిట్టర్‌లో కొన్ని సీట్లు, కొత్తగా వచ్చిన ఎటిసలో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నట్లు అయన తెలిపారు. అసక్తిగల అభ్యర్తులు అన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని లేదా స్పాట్ అడ్మిషన్ కోసం కుకునూరుపల్లి ఐటిఐ కళాశాలలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వచ్చి జాయిన్ కావచ్చునని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు.

# రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలం

**బిఆర్ఎస్ నాయకులు**

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :**

రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమయ్యాయని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, కొండం రవీందర్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిజెపి ఎంపిగా రైతులు ఇబ్బందులు తీర్చాల్సిందిపోయి షాడో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా రఘునందన్‌రావు పని చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ సర్కారు హయాంలో కెసిఆర్ పదేళ్ల కాలంలో ఏనాడు రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ సర్కారు హయాంలో కెసిఆర్ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేశారని నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు రైతులకు చేతగానీ లేనిపోని మాయ మాటలు చెప్పి మోసం చేస్తుందన్నారు.రాష్ట్రంలో బిజెపి ఎంపిలు యూరియాను తెప్పించడంలో పూర్తిగా విఫలం చెందారని తెలిపారు.జిల్లాకు రావాల్సిన యూరియాను సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని పలు మార్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. యూరియా కోసం రైతులను రోడ్డెక్కించిన బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలకు సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పొన్నమల్ల రాములు, యాదగిరి, ఆకుబత్తిని రాము, రవి, రమేష్, సాయి, ఇమ్రాన్, చంటి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎఎంసి చైర్మన్లు, బిఆర్ఎస్ నాయకులు

## మట్టి గణపతుల పంపిణీ

**కొమురవెల్లి, ఆగస్టు 26,ప్రభాతవార్త :** శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం వీరశైవ అగమ పాఠశాల విద్యార్థులచే మట్టి గణపతులను తయారు చేయించి మంగళవారం భక్తులకు, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికపై ఉందని ఈవో అన్నపూర్ణ అన్నారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ పి.విజయలక్ష్మీ, ఎఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, డి.సురేందర్, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**అలియన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో...**

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** అలియన్స్ జిల్లాలోని క్లబ్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా నవరాత్రోత్సవల్లో భాగంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు.సాయి గాయత్రి క్లబ్ అధ్యక్షులు జిడిగాం ప్రసన్నరాణి హైదారాబాద్ రోడ్డులోని మణికంఠ వీల్ టైర్ మాఫియా షాపు వద్ద వెయ్యి విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లా గవర్నర్ ఈశ్వర్ చరణ్ శ్రీ నిలయంలో,ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో వైస్ గవర్నర్ సోమ శివకుమార్ శివాజీనగర్‌లో విగ్రహాలను పంపిణీ చేశారు. భారత్‌నగర్, పార్వతిమాత క్లబ్, రాణిరుద్రమ క్లబ్, మంజుమాత క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అత్మరాములు, వనజ, బాలచంద్రం పాల్గొన్నారు.

**అభయ హస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో...**

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** అభయ హస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం నాచారం ఆలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ సౌజన్యంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, అంగడిపేట హనుమాన్ దేవాలయం, హౌసింగ్ బోర్డు, ఇందిరాపార్కు చౌరస్తా, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద సుమారు 1200 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, దొంతుల సత్యనారాయణ, నంగునూరి విజయ్, ఆకుల రాజు, గులాం హైమద్, కొమురవెల్లి రమేష్, గోలి సంతోష్, సిద్ధి బిక్షపతి, అమర నాగేందర్, గందె సంతోష్, అత్తెల్లి శ్రీనివాస్, నేతి శ్రీనివాస్, నేతి సంతోష్, మల్లేశంగౌడ్, అయిత సత్యం తదితరులు పాల్గొన్నారు.

**డొనేషన్ డూ ఫర్ నేషన్ సంస్థ ఆధ్వర్యంలో...**

**మర్కుక్, ఆగస్టు 26 (ప్రభాతవార్త):** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో మంగళవారం డొనేషన్ డూ ఫర్ నేషన్ సంస్థ ఆధ్వర్యంలో 300 మట్టివినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించే విధంగా మా సంస్థ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నరేష్‌రెడ్డి, పండరి, బిక్షపతి, గణేష్, శ్రీశైలం, శ్రీధర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

**టిపిసిసి ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రవణ్ కుమార్‌రెడ్డి**

**దుబ్బాక, ఆగస్టు 26, ప్రభాతవార్త :** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రవణ్ కుమార్‌రెడ్డి అన్నారు. కుల మతాలకతీతంగా పండగల్ని పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో పీవీఆర్ ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పేద ధనిక భేదాలు లేకుండా ప్రజలందరూ సమానంగా పండుగని జరుపుకోవాలన్నారు. ప్రతిఏటా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ భవాని, మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ ఎస్. బుచ్చిబాబు ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అందే రాజిరెడ్డి, చల్ల సంజీవరెడ్డి, ఇస్తారిగల్ల మల్లేష్, గిరిబాబు, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మోడల్ స్కూల్ అధ్యాపక, ఉపాధ్యాయ బృందం పలువురు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : ఎఎస్ఐ

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ సదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లలగడ్డలో షీటీమ్ ఆధ్వర్యంలో మహిళలకు వారికి ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్‌నేరాలు, సామాజిక రుగ్మతలకు దూరంగా ఉండాలని, సామాజిక మాద్యమాలలో వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని, ఎవరైనా సైబర్ నేరాలకు గురైనెట్లయితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు ఎవరి చేతనైనా వేదింపులకు గురైనా, వారి గురించి ఎవరైనా అపహేలనగా మాట్లాడినా 8712667434, 112 నంబర్‌లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది ప్రశాంతి, కృష్ణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ హెడ్ కానిస్టేబుల్ అలీతో పాటు ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి చేయూత

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు26, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీమహాలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన వలువోజు స్వప్నసదానందంలు మంగళవారం రోజున రూ 10వేల విరాళం అందించినట్లు ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విరాళం ఇచ్చిన వారి కుటుంబాలను ఆ భగవంతుని ఆశీర్వాదం ఉండాలని వేడుకున్నారు. దేవాలయ నిర్మాణానికి సహాయం చేయాలనుకునే దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి : మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26, ప్రభాతవార్త :** విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పాటు ఇంటి వద్ద వారి తల్లితండ్రులకు సైతం ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను గురించి వివరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం రోజున పట్టణంలోని సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు చెత్త విభజనతో పాటు ప్లాస్టిక్ వినియోగం తద్వార జరిగే పరినామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండ్లలో తడి,పొడి చెత్తలను వేరు చేసే విధానం గురించి వివరించారు. విద్యార్థులు ఇంటి నుండి తెచుకునే టిఫిన్‌తో పాటు బాటిల్స్ స్టీల్ పరికరాలే ఉండాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ బానుతో పాటు తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**కొండపాక, ఆగస్టు 26, ప్రభాతవార్త :** మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు సైబర్ నేరాల గురించి కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుడ్‌టచ్ బడ్‌టచ్, ఈవ్ టిజింగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి వివరించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వలన్నారు. షీటీం ప్రాముఖ్యత అది నిర్వ హించే విధుల గురించి తెలియజేశారు. మహిళలు అత్యవసర సమయంలో 100కు పోన్ చేయి పోలీసుల సహాయం పొందాలన్నారు. నేరాల భారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్నేహిత మహిళ సెంటర్లలో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. సైబర్ నేరస్తులు పంపించే ఎలాంటి వాట్స్‌ప్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జయశ్రీ, అధ్యపకులు, గజ్వేల్ షీ టీం హెచ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, పిసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐ లతీఫ్

## వరసిద్ధివినాయక ఆలయంలో శ్రావణసమాప్తి పూజలు

**న్యాల్‌కల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

హిందువులు పవిత్రంగా భావించే శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని హద్నూర్ గ్రామానికి చెందిన 30మంది యువకులు మాసం రోజులు ప్రతి నిత్యం ఉదయం హద్నూర్ గ్రామంలోని స్వయంభూ శ్రీవరసిద్ధివినాయకుడు, రేజింతల్ గ్రామశివారులోని స్వయంభూ శ్రీసిద్ధి వినాయక ఆలయాలను దర్శించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. శ్రావణ మాసం ముగింపును పురస్కరించుకుని ఈ నెల 23న రేజింతల్‌లోని వినాయకఆలయంలో, ఈనెల 25న హద్నూర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు శ్రావణ మాసంలో ప్రతి రోజు ఆలయాలను దర్శించుకోవడం ఆనందంగా ఉందని, గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు.

## బోధనాసిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**-నల్లబ్యాడ్జీలతో నిరసన**



నిరసన తెలుపుతున్న రైతువిజ్ఞాన కేంద్ర ప్రొఫెసర్లు

**జోగిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రొఫెసర్లు అగ్రివర్సిటీ బోధన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారంనాడు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రమోషన్ల నిరాకరణ, శాస్త్రీయత లేని స్కోర్‌కార్డు రూపకల్పన మూడు నెలలుగా తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోందని వారు ఆవేదనవ్యక్తంచేశారు. వర్శిటీ బోధనాసిబ్బంది సంక్షేమంకోసం పాటు పడే నిర్ణయాలుతీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు. ఉద్యోగపరిమితి వయస్సు 65సంవత్సరాలకు పెంచాలని కోరారు. రైతువిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

## గాలయ్య వర్ధంతి ఉత్సవాల్లో మంత్రి




నివాళులు అర్పిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

జోగిపేట మాజీ సర్పంచు కీర్తిశేషులు డాకూరి గాలయ్య వర్ధంతి ఉత్సవాల్లో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని సంతాపం తెలిపారు. జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరై డాకూరి గాలయ్య చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గాలయ్య కుమారుడు డాకూరి వెంకటేశం, మనుమలు డాకూరి శంకర్‌తో పాటు జోగిపేట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మట్టి గణనాథులను ప్రోత్సహిద్దాం కాలుష్యాన్ని నిర్మూలిద్దాం

**-ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి**



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా మున్సిపల్ పట్టణంలోని మున్సిపలిటి కార్యాలయంలో ఖేడ్ పట్టణానికి చెందిన వారికి మట్టి వినాయక విగ్రహాలను ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టివిగ్రహాలను ప్రతిష్ఠించాలని మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని రక్షించడానికి ఎంతో తోడ్పడిన వాళ్లమవుతామని, ప్రతి ఒక్కరూ మట్టివిగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలని నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీచైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్, యాదవరెడ్డి మాజీసర్పంచ్ హనుమాన్లు, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు, గోపిసేట్ పాల్గొన్నారు.

## విష్ణు ఉన్నతపాఠశాలలో వినాయకచవితి

**నర్సాపూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

నర్సాపూర్‌సమీపంలోని విష్ణు పబ్లిక్ ఉన్నతపాఠశాలలో వినాయకచవితిని పురస్కరించుకొని మంగళవారం పండగవేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వినాయక ఆకృతులను చిత్రలేఖనం వేశారు. మరికొంతమంది విద్యార్థులు ఆకులు,కాగితాలు,మట్టితో వినాయక ప్రతిమలను తయారుచేశారు. విద్యార్థులు తయారుచేసిన మట్టి వినాయకులకు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో పురోహితులు హరిచరణ్‌శర్మ వేదమంత్రాలతో ప్రత్యేకపూజలు జరిపారు. పూజల అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులకు తీర్థప్రసాదాలను పంచడం జరిగింది. కార్యక్రమంలో విష్ణు ఉన్నతపాఠశాల ప్రిన్సిపల్ జ్యోతితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణ కోసం మట్టి గణపతిని పూజిద్దాం

**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి**



గ్రామస్థులకు మట్టిగణపతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**శివ్వంపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

పర్యావరణరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని రక్షిద్దామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దొంతి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గుప్తా ఉచిత మట్టి గణపతివిగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై మట్టిగణపతులను పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కల్లూరి హరికృష్ణ, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, సీనియర్ నాయకులు పబ్బ రమేష్‌గుప్తా, మాజీ ఆత్మకమిటీచైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ రైతుసమన్వయసమితి అధ్యక్షులు ములుగు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు గైనబైటి శ్రీనివాస్ గౌడ్, చంద్రకళ, శ్రీశైలం, కన్నారం దుర్గేష్, ఏనుగు సుధాకర్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, నాయకులు జగన్‌రెడ్డి, చింత స్వామి, కల్లూరి రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుల్‌కల్‌లో అధిక ధరలకు యూరియా అమ్మకాలు

**-ఎరువుల దుకాణం ముట్టడి**
**-అరగంటలోపే బస్తాలు ఖాళీ**



చౌటకూరులో డిసిఎంఎస్ వద్ద యూరియా కోసం క్యూకట్టిన రైతులు

**పుల్‌కల్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పుల్‌కల్‌లో యూరియా బస్తాలను అధిక ధరలకు అమ్ముతున్నారంటూ రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. పుల్‌కల్‌లోని సాయిరాం ఫర్టిలైజర్ దుకాణానికి 5వందల యూరియా బస్తాల లోడు వచ్చింది. యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో దుకాణం వద్దకు చేరుకుని యూరియాబస్తా 266.50 రూపాయలకు విక్రయించాల్సి ఉండగా రైతుల నుంచి 3వందలనుంచి 310రూపాయలను ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు.

రైతుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేయడంతోపాటు గంటగులికలు తీసుకుం టేనే యూరియా బస్తాలు అందచేస్తామంటూ దుకాణ యజమాని కొర్రి విధిస్తుండటంతో రైతులు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు. 310 రూపాయలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించిన రైతులకు ఇష్టం ఉంటే తీసుకోండి కష్టమైతే వెళ్లిపోండి అని దురుసుగావ్యవహరిస్తున్నారని రైతులు దుయ్యబడుతున్నారు.

**రోడ్డుప బైఠాయించిన రైతులు...**

అధిక ధరలకు యూరియను విక్రయిస్తున్నారంటూ ఆగ్రహించిన రైతులు సింగూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఇదిలా ఉండగా మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు గంగోజిపేట గ్రామాల్లోని డిసిఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల దుకాణాలకు 660 బస్తాలతో యూరియా లోడ్ వచ్చిందని తెలుసుకున్న రైతులు దుకాణానికి బారులు తీరారు. ఉదయం నుంచే రైతులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. యూరియా బస్తాల లోడు లారీ ఇలా వచ్చిందో లేదో అలా ఖాళీ అయిపోయింది. రైతులు దుకాణాల వద్దకు తెల్లవారుఝాము నుంచే క్యూలైన్‌లో నిలబడటం, చెప్పులు, ఆధార్‌కార్డులను, పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్సు పత్రాలను క్యూలైన్‌లో ఉంచి నిరీక్షిస్తున్నారు. దుకాణం తెరిచిన అరగంటలోనే వచ్చిన యూరియా బస్తాలు ఖాళీ అవుతున్నాయి.

## చిన్నారులచే మట్టి వినాయకుల తయారీ

**-గ్రామాల్లో భక్తులకు పంపిణీ**



చౌటకూరులో మట్టి వినాయకులను తయారు చేస్తున్న చిన్నారులు

**చౌటకూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులచే పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ మట్టి వినాయకులను తయారు చేయించారు. విద్యార్థులు తయారు చేసిన మట్టివినాయకులను విద్యార్థులు తమతమ గ్రామాల్లో ప్రజలకు అందచేసేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల విద్యార్థులచే ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మట్టిగణపతులను తయారుచేయించడం అభినందనీయమని పోషకులు కొనియాడారు.

**విశ్వకర్మలచే మట్టి గణపతుల పంపిణీ...**

మండల కేంద్రమైన చౌటకరులో మంగళవారం వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వకర్మలు మట్టిగణపతులను పంపిణీ చేశారు. పర్యావరణహితంగా పండుగలను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 50మట్టిగణపతులను గ్రామంలో పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయకులను చెరువుల్లో నిమజ్జనం చేసుకుంటే నీరు కలుషితం అవుతుందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు మట్టిగణపతిని పూజించాలని సూచించారు.

## తెల్లాపూర్ మున్సిపల్‌లో 60లక్షలతో అభివృద్ధి పనులు

**-పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆయాకాలనీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ వస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వవార్డు సాయిబాబానగర్ కాలనీలో, కొల్లూరులో 60లక్షల రూపాయల అంచనావ్యయంతో నిర్మించే యుజిడి, సిసి రోడ్లు, బిటి రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనులనిర్మాణానికి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, వెలిమల సొసైటి చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, రవీందర్‌రెడ్డి, కొమరయ్య, శ్రీశైలం, మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కొల్లూరు మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు నరసింహ, మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపురంలోనే దుర్గమ్మ పూజలు...

**పాపన్నపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గాభవానీమాత పూజలు మంగళవారంకూడా రాజగోపురంలోనే కొనసాగాయి. 13రోజులుగా మంజీరాప్రవాహం కొనసాగుతుండటంతో, గర్భగుడి తెరుచుకోలేదు. ఘనపురం ఆనకట్ట పైనుండి 4220 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. నదివైపు ఎవరు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## గణేష్ నిమజ్జనానికి చెరువులను పరిశీలిస్తున్న సిఐ



గణేష్ నిమజ్జనానికి చెరువులను పరిశీలిస్తున్న సిఐ శ్రీనివాస్‌రెడ్డి

**మనూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

వినాయకనిమజ్జనాలకు మండలపరిధిలోని కమలాపూర్ చెరువు పరిసరాలను నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ నెల 27వ తారీఖు నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు (వినాయకచవితి) ప్రారంభం అవుతున్నందున భక్తులు ప్రశాంతంగా పండగలను జరుపుకోవాలన్నారు. నిమజ్జనంచేసే సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చెరువులను, చెరువుపరిసరాలను పరిశీలించామన్నారు. కమలాపూర్ చెరువుకు మండలపరిధిలోని ఆయాగ్రామాలనుంచి భక్తులు విఘ్నేశ్వరులను నిమజ్జనానికి తీసుకువస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు చరణ్‌రెడ్డి, కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌లు ఉన్నారు.

## నానో ఎరువులతో సేద్యం సులభం

**-జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్**




రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లావ్యవసాయ అధికారి శివప్రసాద్

**చౌటకూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

నానో ఎరువుల వినియోగంతో వ్యవసాయం మరింత సులభతరం అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. వ్యవసాయశాఖ ఇఫ్కో, కోరమండల్ సంయుక్తంగా మంగళవారం మండల కేంద్రమైన చౌటకూరులో నానోయూరియా ప్లస్, డిఎపిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో చౌడు పెరుగుతోందన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నానో ఎరువులను వినిగించడంతో పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. సంప్రదాయ ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని, నానోయూరియా, డిఎపిలో పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అవసరానికిమించి రైతులు కాంప్లెక్స్ ఎరువులను వినియోగిస్తుండటంతో యూరియా కొరత తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, యువకులు సంఘాలుగా ఏర్పడి డ్రోన్‌లను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. నమోదీదీ పథకం కింద డ్రోన్‌లను సబ్సిడీపై అందచేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ముందస్తుగా డ్వాక్రాసంఘాలకు డ్రోన్‌లను అందచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. డ్రోన్‌లు అందుబాటులో ఉంటే వరి, ఇతర పంటలకు నానో ఎరువులతో పిచికారీ చేస్తామని రైతులు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో డిఎపి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచలేరని రైతులు మల్లికార్జున్‌గౌడ్, కొల్కూరి మొగులయ్యలు డిఎఓ శివప్రసాద్ దృష్టికి తీసుకుపోయారు. ఈసందర్భంగా రైతులు డ్రోన్ పిచికారీని ప్రత్యక్షంగా తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ టెక్నికల్ ఎడి శ్రీదేవి, జోగిపేట ఎడిఎ రమాదేవి, ఉద్యానశాఖ అధికారి స్వప్న, ఎఓలు చైతన్య, ప్రవీణ్, ఎఈఓలు దత్తురాజ్, ఇఫ్కో మేనేజర్ చంద్రన్న, కోరమండల్ మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, శాంసుందర్‌రెడ్డి, ఇంద్రసేన్, గౌని కిరణ్, డప్పు అశోక్, గౌని కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీ చేయించుకుంటున్న విఫామ్ యజమాన్యం



వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**సదాశివపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామంలో ఉన్న విఫామ్ పరిశ్రమ యజమాన్యం కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటుందని, సరిపడా వేతనాలు ఇవ్వడంలేదని కనీస సౌకర్యాలు అయిన ఈఎస్ఐ, పిఎఫ్ కూడా కార్మికులకు అమలు చేయడం లేదని తక్షణమే ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయని విఫార్మ్ పరిశ్రమ యజమానియంపై కఠిన చర్యలు తీసుకొని పోలీస్ కేసు నమోదు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈరోజు ఉదయం కార్మికులు ఈఎస్ఐ, పిఎఫ్ జివో నెంబర్ నాలుగు ప్రకారం వేతనాలు ఇవ్వాలని కంపెనీ గేటు ముందు ఆందోళన నిర్వహించి యజమాని ప్రతినిధులకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా వి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విఫామ్ పరిశ్రమ యజమాన్యం అతికిరాతకంగా కార్మికులపట్ల ప్రవర్తిస్తుంది అన్నారు. చాలీచాలని జీతాలతో కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటుంది అని అన్నారు. మహిళా కార్మికులతో పని చేయించుకుని సరిగా వేతనాలు ఇవ్వడం లేదు అన్నారు. అనేక సంవత్సరాల నుంచి కార్మికులకు పదివేలు 11 వేల రూపాయలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన జివో నాలుగు ప్రకారం ప్రతినెల కార్మికునికి 23589 రూపాయలు, ప్రతి రోజుకు 907 రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు ఈపరిశ్రమలో ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు లేవు, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయకుండా కంపెనీ ఏవిధంగా నడుస్తుందో అధికారులు సమాధానం చెప్పాలని అన్నారు. తక్షణమే విఫామ్ యజమాన్యంపై ఈఎస్ఐ, పిఎఫ్ అధికారులు తనిఖీ నిర్వహించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. బాల కార్మికులతో కూడా ఈకంపెనీలో పనిచేయించుకుంటున్నారు. క్యాంటీన్ సౌకర్యం ఉండదు. బోనస్ లేదు. లీవ్లు లేవు అని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల కనీస సౌకర్యాలైన జివో4 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఈఎస్ఐ. పిఎఫ్ వంటి చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాస్, అంజయ్య, మల్లేశం, రమేష్, అనిల్ కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**-మట్టిగణపతి పంపిణీలో కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి**

**రామచంద్రాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మట్టి గణపతులను పూజించుకుని పర్యావరణాన్ని కాపాడుకుందామని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి సూచించారు. మంగళవారం భారతీనగర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మట్టి గణపతివిగ్రహాల పంపిణీ కార్యక్రమానికి కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు మట్టి గణపయ్య విగ్రహాలను ఉచితంగా పంపిణీచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ సింధూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐజీ కాలనీలో వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన గణేష్ మండపాన్ని కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, స్థానిక నాయకులు, యవకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మట్టి గణపతుల పంపిణీ

**రామచంద్రాపురం, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద కార్పొరేటర్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతులను కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ ప్రజలకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణిచేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ మట్టిగణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని డివిజన్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కెఎస్ఎస్ కేశవులు, కాంగ్రెస్ నాయకులు మావిన్‌గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కావలి నగేష్, పీటర్, ఎల్మర్తి మల్లేశం, స్రామాట్, మల్లేష్, శ్రీనివాస్, హన్మంతు, రమేష్, రఫీ, నాయుడు, కాలనీవాసులు వీర్‌శెట్టి, నరేంద్ర, బాబు, లక్ష్మణ్‌యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై వ్యవసాయ పరికరాలు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

50శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను అందుకునేందుకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రవీణ్‌చారి తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, మహిళారైతులకు 50శాతం సబ్సిడీ, ఇతరరైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను అందచేయడం జరుగుతుందన్నారు. మండలానికి 303 బ్యాటరీ స్ప్రేయర్లు, 40పవర్ స్ప్రేయర్లు, పంపులు, 15రోటవేటర్లు, 4సీడ్ కమ్ ఫర్టిలేజర్ డ్రిల్లులు, 25డిస్క్‌హ్యారో, 4పవర్‌వీడర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అందచేసిన దరఖాస్తులను మండలస్థాయిలో నియమించిన కమిటీ సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని, కమిటీకి కన్వీనర్‌గా మండల వ్యవసాయ అధికారి, సభ్యులుగా తహసీల్దార్, ఎంపిడిఓలా వ్యవహరిస్తారన్నారు. దరఖాస్తుపత్రాలతోపాటు ఆధార్‌కార్డ్, పట్టాదారు పాసుపుస్తకం, ట్రాక్టర్ సంబంధిత పరికాలకు ఆర్‌సి, బ్యాంక్ పాసుపుస్తకం, 2పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, నేల సారానికి సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డును జతపర్చి రైతు వేదికలోని క్లస్టర్ ఎఈఓలకు లేదా మండల వ్యవసాయ అధికారికి అందచేయాలని మండల రైతులకు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి సూచించారు.

## సొంతనిధులతో వినాయక మంటపం ఏర్పాటు



వినాయక మంటపాన్ని ప్రారంభించిన కాట శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

సొంతనిధులతో బీరంగూడ వందనపురి కాలనీలోనీ సాయిరాజా హోమ్స్‌లో వినాయకమండపాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్‌పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాటా సుధాశ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్‌రెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీరంగూడ వందనపురి కాలనీలోని సాయిరాజా హోమ్స్‌లో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, సుధారాణి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీకౌన్సిలర్ లావణ్య, శశిధర్‌రెడ్డి తమ సొంతనిధులతో నూతన వినాయకమండపాన్ని ఏర్పాటుచేశారు, ఈ మండపాన్ని కాటా శ్రీనివాస్‌గౌడ్, సుధారాణి, లావణ్య, శశిధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కాలనీవాసులు కాటా శ్రీనివాస్ గౌడ్ దంపతులకు, లావణ్య, శశిధర్‌రెడ్డిలకు ప్రత్యేకకృతజ్ఞత తెలియజేశారు. ఈకార్యక్రమంలో బీరంగూడ శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయం చైర్మన్ బైసా సుధాకర్‌యాదవ్, అమీన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మన్నె రవీందర్, అమీన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రమేష్‌యాదవ్, ఆలయ కమిటీ మెంబర్ పెద్ద మల్లేష్‌యాదవ్, లక్ష్మీ ..., సాయిరాజా హోమ్స్ కాలనీ అధ్యక్షుడు మల్లేష్, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాలనీవాసులు, కెఎస్‌జి యువసేన సభ్యులు, కాలనీవాసులు, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## మట్టి గణపతిలనే పూజిద్దాం




మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అరవిందశ్రీ

**సదాశివపేట, ఆగస్టు 26, ప్రభాతవార్త:**

సదాశివపేట పట్టణం నందు శాంతినికేతన్ విద్యాలయంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై వినాయక చవితి సంబరాలను గురించి, ప్రమాదాల జరగకుండా జాగ్రతల గురించి ప్రిన్సిపాల్ అరవిందశ్రీ విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు మట్టి గణపతులు చక్కగా తయారుచేయడం జరిగింది. విఘ్నేశ్వరుని విగ్రహాలు తయారు చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. రేపటినుండి జరగబోయే వినాయక ఉత్సవాల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే సూచనలు, జాగ్రతలను పాటించి సంబరాలు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. కరెంటు వైర్ల దగ్గర, వినాయక మండపాల దగ్గర, వాహనాల దగ్గర, నిమజ్జన స్థలం వద్ద, నిమజ్జన ఊరేగింపులో సాధ్యమైనంత వరకు మీతల్లిదండ్రులను అనుసరించి జరుపుకోవాలని సూచించారు. మీరు క్షేమంగా ఉంటేనే మీ తల్లిదండ్రులు మీ ఉపాధ్యాయులు మీ బంధువులు సంతోషంగా ఉంటారు అని అన్నారు. మీరు చేసిన ఈ మట్టి విగ్రహాలు పాఠశాలలో చేయడమే కాదు మీరు ప్రతి ఒక్కరు కూడా మీ ఇళ్లలో ఏర్పాటుచేయడానికి మీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన రంగురంగుల విగ్రహాలనునిర్మూలిద్దాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మాణం చేద్దామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.